క్లుప్తంగా

శ్రీమఠంలో కర్ణాటక మంత్రి



మంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

మంత్రాలయం: సద్గురు రాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్ణాటక మంత్రి మునియప్ప ఆదివారం మంత్రాలయం విచ్చేశారు. శ్రీమఠం అధికారులు ఆలయ మర్యాదలతో ఆయనకు ఆహ్వానం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూలబృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, ప్రత్యేక మాలతో ఆశీర్వదించారు. శ్రీమఠం జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ ఉన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నటరాజస్వామి

ఆదోనిఅర్బన్: స్థానిక లలితకళా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కేఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో రచయిత సద్దాంహుసేన్ రచించిన పెద్ద పెండేకల్ ఆచార్య ఆంజనేయస్వామి చరిత్ర అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆవిష్కర్త నటరాజస్వామి, సమీక్షకులు నల్లారెడ్డి మాట్లాడుతూ.. ఈ పుస్తకం అజరామరమని కొనియాడారు. స్వామివారి చరిత్ర గురించి అద్భుతంగా రాశారని, ప్రతి ఒక్కరూ చదవాలని కోరారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు



కరపత్రాలు అందజేస్తున్న నాగరాజు గౌడ్

కౌతాళం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని ఉరుకుంద ట్రస్ట్‌బోర్డు చైర్మన్ నాగరాజు గౌడ్ అన్నారు. ఆదివారం ఉరుకుంద, ఓబులాపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. నవరత్నాల పథకాలను వివరించి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవరత్నాలతో పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన వెంట నాయకులు బంగారి, ఈరన్న, గౌడ ఉన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆదోనిఅర్బన్: ఆదోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చినట్లు ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు కాకుబాల్ నగేష్ తెలిపారు. హైదరాబాద్ ఏషియన్ వాస్కులర్ ఆస్పత్రి వైద్యులు సుమారు 380 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో రాచోటి సుధాకర్, ప్రతాప్, నరసింహయ్య, అవోపా ప్రెసిడెంట్ వంకదారు శ్రీనాథ్‌గుప్తా, ఉపాధ్యక్షుడు ప్రతాప్, ఏషియన్ వాస్కులర్ ఆస్పత్రి వైద్యులు సోమాచారి, విశాల్, ప్రమోద్, హరిప్రకాష్, నవీన్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత



క్రికెట్ కిట్‌తో యువకులు

ఆదోనిటౌన్: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదోని మండలం సుల్తానాపురం గ్రామానికి చెందిన యువతకు పార్టీ నేత మనోజ్‌కుమార్‌రెడ్డి ఆదివారం క్రికెట్ కిట్ అందజేశారు. సర్పంచ్ వీరేష్ సమక్షంలో కిట్‌ను అందజేశారు. యువత క్రీడలపై మక్కువ పెంచుకుని గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. రామాంజనేయులు, వీరేష్, ఆనంద్ తదితరులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

శబరిమలైకు పయనం

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన అయ్యప్పస్వామి భక్తులు ఇరుముడితో కేరళ రాష్ట్రంలోని శబరిమలైకు బయలుదేరి వెళ్లారు. ఆదివారం అప్పోజప్పస్వామి మఠంలో శ్రీశంభు లింగేశ్వరస్వామి దేవాలయంలో గురుస్వామి గోవిందు రాజు ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మాల ధరించిన భక్తులకు ఇరుముడి కట్టించారు.అ య్యప్పస్వామికి మెట్లపూజ, పడి పూజ చేశారు. స్వామి వారి సన్నిధి చేరేందుకు బయలుదేరి వెళ్లారు.

ఆరోగ్య ప్రదాయిని



వంద పడకల భవనంలో ప్రారంభమైన వైద్యసేవలు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వైద్యం, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యంగా పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోంది. ఆరోగ్యశ్రీతో అన్ని రకాల రోగాలకు పైసా ఖర్చు లేకుండా వైద్య సేవలు అందిస్తోంది. వైద్యులు, వైద్య సిబ్బంది కొరత లేకుండా భారీగా నియామకాలు చేసింది. ఆదోని ఏరియా ఆస్పత్రిలో ఇన్నాళ్లు అరకొర వైద్యం, రెఫరల్స్‌తో సరిపెట్టుకునే పరిస్థితి ఉండేది. అయితే ప్రభుత్వ చొరవతో 420 పడకల హాస్పిటల్‌గా మారనుంది. స్పెషలిస్టు వైద్యులు సైతం అందుబాటులోకి రానుండడంతో అన్ని రకాల వ్యాధులకు కార్పొరేట్ తరహా వైద్యం అందనుంది.

- సర్వజన ఆస్పత్రిగా రూపుదిద్దుకుంటున్న ఆదోని ఏరియా ఆస్పత్రి
- అందుబాటులోకి రానున్న కార్పొరేట్ వైద్య సేవలు
- స్పెషలిస్టు వైద్యులతో అన్ని రకాల వ్యాధులకు వైద్యం
- రోగులకు తీరనున్న కష్టాలు



ఆదోని ఏరియా ఆస్పత్రి ముఖ ద్వారం



వేగవంతంగా జరుగుతున్న భవన నిర్మాణ పనులు

ఆదోనిటౌన్: ఆదోని ఏరియా ఆస్పత్రి సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిగా రూపుదిద్దుకుంటోంది. సుమారు 23 ఏళ్లుగా ఏరియా ఆస్పత్రిగా ఎంతో పేరుగాంచింది. క్రమంగా ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. దీంతో వైద్య సేవలను మరింత విస్తరింపజేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదోనికి మెడికల్ కళాశాలను మంజూరు చేశారు. వైద్య కళాశాల నిర్మాణం కోసం రూ.475 కోట్లు విడుదల చేశారు. నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి. కళాశాలకు అనుబంధంగా ఏరియా ఆస్పత్రిలో 420 పడకల భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వంద పడకల ఏరియా ఆస్పత్రిగా గుర్తింపు పొందగా నేడు 420 పడకల ఆదోని సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిగా రూపుదిద్దుకుంటోంది.

కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు

ఆదోని ఏరియా ఆస్పత్రి ఆవరణలో అత్యాధునిక వసతులతో నిర్మించిన వంద పడకల నూతన భవనం అందుబాటులోకి వచ్చింది. ప్రజలకు సేవలందిస్తోంది. రెండు నెలల క్రితం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఈ భవనాన్ని ప్రారంభించారు. నాడు-నేడు పథకం కింద రూ.10 కోట్లతో భవనాన్ని నిర్మించారు. మరో 220 పడకల భవనాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇది పూర్తయితే కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. గతంలో చిన్న ప్రమాదం జరిగినా, ఇతరత్రా కేసులు వచ్చినా డాక్టర్లు లేరని వైద్య సదుపాయాలు లేవని సాకులు చెబుతూ కర్నూలుకు రెఫర్ చేసేవారు. అయితే మరో ఏడాదిలో రెఫరల్‌లకు ఫుల్‌స్టాప్ పడనుంది.

మాట నిలబెట్టుకున్న సీఎం

ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా ఆదోనికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు, వివిధ సంఘాలు ఏరియా ఆస్పత్రిలో డాక్టర్లు లేరని, వసతులు లేవని విన్నవించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఏరియా ఆస్పత్రి రూపురేఖలు మారుస్తామని ఆయన హామీ ఇచ్చారు. నేడు ఇచ్చిన మాట మేరకు ఆదోనికి మెడికల్ కళాశాల మంజూరు చేశారు. వంద పడకల ఏరియా ఆస్పత్రిని జీజీహెచ్‌గా తీర్చిదిద్దారు. ఇక కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి రానుంది.

రోగులకు మెరుగైన వైద్యం



సర్వజన ఆస్పత్రిలో జరుగుతున్న నిర్మాణ పనులు పూర్తయితే కొత్తగా డాక్టర్లు, ప్రొఫెసర్లు, ఫిజీషియన్స్ వస్తారు. 420 పడకలకు అనుగుణంగానే వైద్యసిబ్బంది నియామకాలు జరుగుతాయి. ప్రతి జబ్బుకు వైద్యం అందుబాటులోకి రానుంది. ఇక రెఫర్‌లు ఉండవు. అన్ని జబ్బులకు ఇక్కడే వైద్యం చేస్తాం. ఏదేని క్రిటికల్ కేసు ఉన్నా స్పెషలిస్టులు అందుబాటులో ఉంటారు. ఇక పేదల వైద్యానికి ఇబ్బంది ఉండదు.

–ఎం.శ్రీనివాసనాయక్, ఆస్పత్రి సూపరింటెండెంట్

రోగుల కష్టాలు తీరినట్టే



ఆదోని ప్రాంతంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు మెడికల్ కళాశాలను మంజూరు చేశారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా పెద్దాస్పత్రి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మరో ఏడాదిలో మెడికల్ కళాశాల సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఆదోని ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

–సాయిప్రసాద్‌రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే

క్వింటా మిర్చి రూ.28,111



అమ్మకానికి వచ్చిన మిర్చి

ఆదోనిఅర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎండు మిరపకాయల యార్డులో ఆదివారం మిర్చి క్వింటా రూ.28,111గా పలికింది. 956 బస్తాలను రైతులు తీసుకుని రాగా గరిష్టంగా రూ.28,111 పలికింది. మధ్య రూ.16 వేలు, కనిష్టంగా రూ.6 వేలుగా నమోదైంది. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఏర్పాటు చేసిన మిర్చి యార్డులో రెండో రోజు అధిక సంఖ్యలో మిర్చి రావడం విశేషం. మొదటి రోజు రూ.24 వేలు గరిష్ట ధర పలకగా, రెండో రోజు రూ.28 వేలు పలకడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఆదివారం, బుధవారం మిర్చి యార్డు ఉంటుందని, రైతులు ఈ రెండు రోజుల్లో అమ్మకానికి తీసుకురావాలని యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి రైతులకు తెలిపారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: జిల్లాలో దసరా ఉత్సవాలకు ప్రత్యేకతను సంతరించుకున్న దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఆలయంలోని మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవా, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాన్ని అందజేశారు. స్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. వారికి ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేశారు.

టీడీపీలో చేరినట్లు దుష్ప్రచారం



ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సమక్షంలో చేరిన బడేసాబ్

ఆదోనిటౌన్: తాను, తన కుటుంబ సభ్యులు టీడీపీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు దుష్ప్రచారం చేశారని ఆదోని మండలం దొడ్డనకేరికి చెందిన బడేసాబ్ అన్నారు. టీడీపీలో చేరామన్నది అవాస్తవమన్నారు. శనివారం టీడీపీ నాయకులు కొందరు తనకు మద్యం తాగించి చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామని నమ్మబలికి ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టి తమను ఇబ్బందులపాలు చేశారన్నారు. దిగజారుడు రాజకీయాలు చేయడం టీడీపీ నాయకులకే చెల్లిందన్నారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల పేదలు బాగుపడ్డారని.. ఆయన లాంటి వారు ముఖ్యమంత్రిగా ఉంటే అందరూ బాగుంటారని తెలిపారు. ఎప్పటికే వైఎస్సార్‌సీపీలోనే ఉంటామని తేల్చి చెప్పారు. తాము ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి వెంటే ఉన్నామని స్పష్టం చేశారు.

నేడు కౌతాళంలో గడప గడపకు

కౌతాళం: మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రహ్లాదాచారి, సర్పంచ్ పాల్‌దినాకర్ తెలిపారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే చొరవతో బాధితులకు న్యాయం



ఎమ్మెల్యే చొరవతో న్యాయం జరిగిందంటున్న బాధితులు

ఆదోనిటౌన్: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి రెండు రోజుల క్రితం ఆదోని మండలం చాగి గ్రామానికి వెళ్లారు. గ్రామానికి చెందిన బెస్త సరస్వతి, ఆమె భర్త రంగన్న తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తమకున్న 9 ఎకరాల పొలాన్ని సోలార్ ప్లాంట్‌కు తొమ్మిదేళ్ల క్రితం విక్రయించామని.. వచ్చిన డబ్బులో సిద్ధప్ప అనే వ్యక్తి అప్పుగా రూ.17 లక్షలు, టీడీపీకి చెందిన రంగస్వామి రూ.9 లక్షలు తీసుకుని తిరిగి చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నాడని వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆదివారం తన నివాసానికి ఇరువర్గాలను పిలిచి విచారణ చేశారు. బాధితులకు నగదు చెల్లించాలని సిద్ధప్ప, రంగస్వామికి తెలిపారు. వీలైనంత త్వరగా నగదు చెల్లిస్తామని ఎమ్మెల్యే సమక్షంగా చెప్పడంతో బాధితులు హర్షం వ్యక్తం చేశారు.

వరల్డ్ బుక్ అఫ్ రికార్డులో ఆదోని కవయిత్రి



ప్రశంసాపత్రం అందుకుంటున్న రమాదేవి

ఆదోని సెంట్రల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న కవయిత్రి రమాదేవి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని బుద్ధాల కన్వెన్షన్ హాలులో తెలుగు సాహిత్య కళా ఉత్సవాలు శని, ఆదివారం నిర్వహించారు. రమాదేవి రచించి, పఠించిన 'సీమ పిలుపు' అనే కవిత వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించింది. అలాగే భారత టాలెంట్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ అఫ్ రికార్డు (తెలుగు అసోసియేషన్ అఫ్ నేషనల్ అకాడమీ), కల్చరల్ టాలెంట్స్ బుక్ అఫ్ రికార్డ్స్‌లో తన పేరు నమోదు చేస్తున్నట్లుగా ధ్రువీకరిస్తూ పత్రాలు, మెమొంటోలు ఇచ్చినట్లు రమాదేవి తెలిపారు. వరల్డ్ బుక్ అఫ్ రికార్డు సాధించిన రమాదేవిని పలువురు రాజకీయవేత్తలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, కమ్మరచేడు గ్రామ పెద్దలు, బంధువులు, స్నేహితులు అభినందించారు.

టీబీ డ్యాంకు ఆగిన ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయం

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయం (టీబీ డ్యాం)కు రెండు రోజులుగా ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. ఇక హొళగుంద సెక్షన్‌లో ఎల్లెల్సీలో నీటి ప్రవాహం ఆశాజనకంగా ఉంది. డ్యాం ఎగువ భాగంలోని ఆగుంబే, శృంగేరి, తీర్థనహళ్లీ, వరనాడు, శివమొగ్గ, చిక్ మంగళూర్ తదితర దక్షిణ, ఉత్తర కర్ణాటక ప్రాంతాల్లో వర్షాలు తగ్గిపోవడంతో నీటి చేరిక నిలిచింది. ఈ ఏడాది డ్యాంకు వరద ముందుగానె మొదలైనా ఆ తర్వాత వర్షాభావం కారణంగా నీటి చేరిక తగ్గిపోవడంతో జలాశయంలో నీరు లేక వెలవెలబోతోంది. ప్రస్తుతం డ్యాంలో 1590 అడుగులతో 11 టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయి. ఇక 1,916 క్యూసెక్కుల నీటిని డ్యాం నుంచి కాలువలకు విడుదల చేస్తున్నారు. గతేడాది ఇదే సమయానికి 84.832 టీఎంసీల నీటి నిల్వ ఉండి ఇన్‌ఫ్లో 2,495 క్యూసెక్కులుండేది. ఇక జిల్లాలో ప్రవహించే దిగువ కాలువ (ఎల్లెల్సీ) 250 కి.మీ వద్ద 450 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

తెలుగు సాహిత్య ఉత్సవాల్లో యువకవి ప్రతిభ



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వీరేష

మంత్రాలయం: పశ్చిమ గోదావరి జిల్లా తాడెపల్లిగూడెంలో శని, ఆదివారాలు ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలు జరిగాయి. కవితా పఠనం విభాగంలో మంత్రాలయం మండలం విద్యానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషాపండితుడిగా పనిచేస్తున్న యువ కవి దుంపాల వీరేష ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 'నేను చెక్కిన శిల్పం' కవితతో అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, టీఎస్ఏ బుక్ ఆఫ్ రికార్డ్స్, కల్చరల్ టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు ఎంపికయ్యారు. వేడుకలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్, సినీ గేయ రచయిత కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా ప్రపంచ రికార్డు నమోదు ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందుకున్నారు. ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయుడు దుంపాల వీరేషను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం, గురువులు సక్కిరి భాస్కర్, సాదుల సత్యనారాయణ, నాగలాపురం సర్పంచ్ హనుమంతరెడ్డి అభినందించారు.

శ్రీరామ మందిరం ప్రారంభోత్సవానికి ఆహ్వానం



పీఠాధిపతికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న విశ్వ హిందూ పరిషత్ సభ్యులు

మంత్రాలయం: అయోధ్య శ్రీరామ మందిరం ప్రారంభోత్సవానికి ఆహ్వానం నిమిత్తం విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సాయి రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటరామయ్య, జాయింట్ సెక్రటరీ ప్రాణేష్ ఆదివారం మంత్రాలయం వచ్చారు. ముందుగా మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులను కలిసి అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవ అధికార ఆహ్వాన పత్రికను అందించారు.

ప్రారంభానికి సిద్ధం



కోసిగిలో రైతు భరోసా కేంద్రం

కోసిగి: ప్రజల ముంగిటకే సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య హెల్త్ సెంటర్‌లు ఏర్పాటు చేసింది. ఇంకా అవసరమైన చోట్ల కొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. కోసిగి మండలంలో 19 సచివాలయాలు, 17 రైతు భరోసా కేంద్రాలు, 14 వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఒక్కో సచివాలయ నిర్మాణం రూ.43.50 లక్షలు, రైతు భరోసా కేంద్ర నిర్మాణం రూ.23.50 లక్షలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ రూ.21.50 లక్షల చొప్పున నిధులు కేటాయించి నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం కోసిగిలో రైతు భరోసా-1, 2, కోసిగి సచివాలయం-1, వందగల్లు సచివాలయం నిర్మాణాలు పూర్తి కావచ్చాయి. త్వరలోనే ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభానికి సిద్ధమయ్యాయి. మండలంలోని అన్నీ నిర్మాణాలు త్వరలోనే పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

ఏఐటీయూసీ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన ఏఐటీయూసీ నాయకులు

ఆదోనిరూరల్: ఆదోని ఎస్‌కేడీ కాలనీలోని ఎన్‌జీవోస్ హోమ్‌లో ఏఐటీయూసీ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా అజయ్‌బాబు, అధ్యక్షుడిగా హెచ్.సత్యనారాయణ, డివిజన్ ప్రధాన కార్యదర్శిగా బి.రాజీ, కోశాధికారిగా బసవన్నగౌడ్, ఉపాధ్యక్షులుగా కృష్ణమూర్తి, నాగేంద్రప్ప, రత్నకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రాజశేఖర్, కాశప్ప, క్రిష్ణయ్య, హుసేని, జాయింట్ సెక్రటరీలుగా టి.భాస్కర్, శంకర్, ఎం.రాముడు, శ్రీనివాసులు, దస్తగిరి, చిన్నా, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రాముడు, శేఖర్, షేక్షావలి, వేదవ్యాసముని, మహేశ్వర్‌రెడ్డి, రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీఐటీయూ నుంచి ఏఐటీయూసీలోకి చేరిక

విద్యుత్ శాఖలో సీఐటీయూ నుంచి 60 మంది విద్యుత్ కాంట్రాక్ట్, రెగ్యులర్ ఉద్యోగులు ఏఐటీయూసీలోని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం)లోకి చేరారు. వీరి చేరికపై ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నవీన్‌కుమార్, సురేష్ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆదోని జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. బసవన్నగౌడ్ అధ్యక్షత వహించగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, సురేష్‌కుమార్, విద్యుత్ ఉద్యోగులు మాట్లాడారు. కార్మికుల సమస్యలపై పోరాటం సాగిస్తామన్నారు. ఏఐటీయూసీ టౌన్ సెక్రటరీ వెంకన్న, ఏఐటీయూసీ నాయకులు రాజు, షేక్షావలి పాల్గొన్నారు.

వైభవంగా కనకదాసు విగ్రహ ప్రతిష్టాపన



విగ్రహ ప్రతిష్టాపనలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం: మండల పరిధిలోని సుంకేశ్వరి గ్రామంలో కురువల ఆరాధ్య దైవం శ్రీభక్త కనకదాసు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆదివారం వేకువజామున నుంచి ప్రత్యేక పూజలు చేపట్టి భక్త కనకదాసు విగ్రహానికి ప్రతిష్టాపన చేపట్టారు. కురువలు అత్యధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురువలు భక్త కనకదాసు మార్గంలో నడుచుకోవాలని సూచించారు. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు భీమారెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, మద్దిలేటి, సీఏ శ్రీనివాసులు, ఎస్ఐ కిరణ్, సర్పంచ్ ముక్రన్న, ఎంపీటీసీ విశాలక్షి పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన కార్తీక ఉత్సవాలు



భారీగా తరలివచ్చిన భక్తులు

ఆదోనిరూరల్: మండలంలోని బల్లేకల్ గ్రామంలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి (తిమ్మప్ప స్వామి), పద్మావతి (అలిమేలు మంగమ్మ) ఆలయంలో కార్తీకమాస ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఏటా కార్తీక మాసంలో మూడు రోజల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. శనివారం వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్ల ఉత్సాయాన్ని గ్రామవీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, నైవేద్య సమర్పణ, నందికోలు సేవ, దాసంగ నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.



స్వామివారి రథోత్సవం, వేంకటేశ్వర స్వామిపద్మావతి దేవి



కోలాటాలు ఆడుతున్న భక్తులు

